వుంటేది అర్ధగంటే. ఆ అర్ధగంట తర్వాత ఢిల్లీ నించి వార్తలు తవిప్రసారం చేయబడుతవి. కాని—ఆ మహానుభావుడు తీరా "సీతారాముల జననం" చెప్పుకొచ్చేసరికే అక్కడ టైం ఐపో వచ్చింది. ఇంకొక్క నిముషమే మిగిలివుంది. ఆ హరిదాసుగారు పాపం, టైం ఎంతుందో గమనించక, కళ్లుమూసుకొని మహదానందంగాపాడేస్తున్నాడు, అనౌన్సర్ వచ్చి "టైం అయిపోయింది. ఇహ ఆపండి"అన్నట్లు సైగ చేశాడు. ఆ పుణ్యాత్ముడు కాస్తా "అయ్యో! ఎలా ఆపనండీ మంగళం పాడకుండానూ, అది కాస్తా క్షణంలో ముగించేస్తా"అని మైక్ ముందుమాట్లాడేసరికి ఆ అనౌన్సర్ పాపం, నిలువునా కంపించిపోయాడు. తర్వాత "ఇంతవరకూ సీతాకల్యాణం హరికథా కాలక్షేపం విన్నారు. కథకులు ఫలానివారు"అని తడబడతూ చివరికి ఎలాగో అనౌన్సు చేసేశాడు. ఇంతకీ ఆ భాగవతారు శ్రోతలకు వినిపించింది సీతారామ జననం మాత్రమే అయినా, అనౌన్సర్ మాత్రం "సీతా కల్యాణం"విన్నారనే చెప్పాలి. లేక ఇంకేదయినా చెబితే అది డీవియేషన్ ఐపోతుంది.

---

# నారీ మూల్యం

కు. జానికిరామ్ పట్నాయిక్

ముప్ఫయ్యారు గంటల రైలు ప్రయాణం—యీ రోజుల్లో యెలా వుంటుందో ఆలోచించండి! ఇంటికి చేరుకొని యేదో సయించినంత మట్టుకు యింత తిని మూడో అంతస్తు గదిలోని మంచంమీద శరీరం చేరవేసేసరికి ప్రక్కమైదానము నుంచి కామోసు 'బ్రాడ్‌కాస్ట్' అవుతూన్న ఉపన్యాసం గదంతా ఆవరించుకుంది! "...హిందూకోడ్ బిల్ సనాతన ధర్మ వృక్షానికి గొడ్డలిపెట్టు! పవిత్ర దాంపత్య సూత్రానికి కత్తెరకోటు! జన్మ జన్మాంతరాలనుంచి వస్తున్న భార్యా భర్తల పవిత్ర సంబంధాన్ని భస్మం చేసే ప్రచండాగ్ని! గృహసామ్రాజ్యానికి మహారాణులై ఉన్న మహిళామణుల్ని పదచ్యుతుల్ని చేసే భయంకర విప్లవశక్తి!..."

సింహగర్జనల్తోవున్న ఆ వుపన్యాసం నిద్రాభంగం కలిగిస్తుందేమోనని కిటికీలు మూసి పరున్నాను! వింతవింత ఆలోచనల్తో కనురెప్పలు మూసుకు పోయాయి!

* * *

'బేబీ ఆస్టిన్' తారురోడ్డు మీదనుంచి జారిపోతున్నది చల్లగా-విసురుగా. చక్రాలనుంచి ఉండుండి యేదో మర్మర ధ్వని బయటపడుతున్నది. దీక్షగా విన్నాను. "హిందూకోడ్ బిల్, హిందూకోడ్ బిల్"అనే అస్పష్టపు మాటలు వినవస్తున్నాయ్, నాలోనవ్వుకుంటుండగా రామం యింటిముందు కారు నిల్చింది. బయటకుదిగి యింటి ద్వారాన్ని సమీపించాను. లోనుంచి స్త్రీ గొంతుక వినవచ్చింది. "...ఒద్దు మీరా క్లబ్బుకు వెళ్ళొద్దు! రోజూ యిదేనా పని? తిరిగి వచ్చేసరికి రాత్రి పన్నెండు దాటడము, ఒంటిమీద తెలివే లేకుండా త్రాగి రావటము! ఒద్దు!..."ఆ మాటలు పూర్తి కాకమునుపే, 'ఛట్ ఫట్' మనే దెబ్బల చప్పుడూ యీ మాటలూ వినవచ్చాయ్. "నోర్మూయ్! లేదా ఒళ్లు హూనం చేసివేస్తాను. ఏమనుకున్నావేమిటి? నీ పెట్టుపోతల్లో వున్నట్టు మహా దభాయిస్తున్నావ్! ఈ సారి నోరెత్తావంటే ప్రాణాలు తీసివేస్తాను! నీయబ్బ ఎవడడ్డువస్తాడో చూస్తా! "

ఒక క్షణమైనా అచట నిల్చోటానికి బుద్ధి పుట్టింది కాదు. కారులోనికి ఒక్క వుదుటున దుమికి 'బుర్రు' మనిపించాను. పావుగంటకల్లా మోడరన్ రెస్టారెంటు యెదుట - బండి ఆగింది. టీ పుచ్చుకుందామని లోన పాదముంచేసరికి మిత్ర బృందం తారసిల్లారు. కుర్చీ ఒకటి లాక్కొని కూచొనేలోగామూర్తి ఒక స్వీటుకూ ఒకహాటుకూ ఆర్డరిచ్చాడు. ముందు రెండుగజాల దూరంలో మధుసూదనం ఒక సీతాకోక చిలుకతో టీ సేవిస్తున్నాడు. నాకాశ్చర్యంవేసింది. ఆమె యెవరా అని? మూర్తి స్పష్టపర్చాడు.

"ఆమె అతని క్రొత్త ప్రియురాలు! భార్యకేమో పిచ్చి యెత్తిందట! ఉన్న ఇద్దరి పిల్లల్లో ఒకడు వారం క్రితమే ఏదో జబ్బువల్ల గతించాడట!" ఇంకా ఆ మాట ఆఖరు కావటమే లేదు చంకలో ఒక కుర్రాణ్ణి పెట్టుకొని మాసిన చీరతో, రేగిన జుత్తుతో ఒకామె మా మధ్యకొచ్చి యిలా గోల పెట్టింది: "అంతా అబద్ధం! నాకు పిచ్చెక్కలేదు! అతడు నన్ను తరిమి వేశాడు. తినటానికీ, కట్టటానికీ ఇవ్వలేదు. నా కన్నవారింటికి పొమ్మన్నాడు. వెళ్ళనంటే నన్నూ, పిల్లల్నీ బయట నెట్టేసి యింటికి తాళం వేసుకుని ఎటో వెళ్ళిపోయాడు. నెల దినాల తరువాత ఆ కులుకులాడితో వచ్చాడు. వారం క్రితమే తాగటానికి గరిటెడు పాలు లేక చంటిపిల్లాడు చనిపోయాడు. నేను వెళ్ళి అతని పాదాలు పట్టుకొని యేడిస్తే పడుపు వృత్తి చేసుకొని బ్రతకమన్నాడు. నాకు దుఃఖమూ కోపమూ వచ్చి అల్లరిచేస్తే పిచ్చి ఎక్కిందని ప్రచారం చేస్తున్నాడు. డబ్బున్నవాడు అవటంవల్ల లోకం నిజంగా నేను పిచ్చిదాన్ననే తలుస్తున్నది. కాని నేను పిచ్చిదాన్ని కాను. యీతడు—" అని ఆమె ముందుకు వెళ్ళబోతుంటే యిద్దరు నౌకర్లు వచ్చి ఆమెను బయటికి గెంటి వేశారు.

నేను తిరిగి కారులో పార్కుకు చేరుకున్నాను. ఒక గున్నమామిడి క్రింద యిద్దరు యువతులు కూచొనివున్నారు. వారికి పది గజాల దూరంలో యేభయ్యో పడిలోవున్న ఒక నాగరికుడు వేరొకరితో అంటున్నాడు: "అవునండీ! ఆ యిద్దరూ మావారే. కాని ఏం లాభం? ఏ ఒకరికీ సంతానం కలగలేదు. ఇదిగో యీ మాఘంలో యింకో సంబంధం చేసుకోవాలని వుంది. ఆ వచ్చిందాని కడుపునయినా ఒక నలుసు కలిగితే" అచ్చట మరి నిలబడ బుద్ధి పుట్టిందికాదు. కారును సమీపించేసరికి ఆశ్చర్యం!...దాని టాపుమీద నిల్చుని ఒక మహిళామణి వుపన్యసిస్తున్నది: "ఇంకా వినండి. బొంబాయి ప్రాంతంలో 1945-48 సంవత్సరాల్లో 7600 మంది యువతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాటిలో 3800లు భర్తల అత్యాచారాలవల్లనూ, 1800లు బహు భార్యాస్వీకరణవల్లనూ జరిగినట్లు నిర్ణయించారు... చూడండి! యీ దురాచారాలనూ, దుర్మరణాలనూ అరికట్టాలీ అంటే మనమంతా—"

కారులో నేను దూరేసరికి ఆమె ఒక గంతు వేసి వెళ్ళిపోయింది. నేనూ యింటిముఖం పట్టాను. తోవలో ఎవరో ఒకామె పరుగుపరుగున కారు ముందుకు రావటం చూసి "బ్రేక్" వేశాను. గజం దూరంలో ఆమె వుండిపోయింది. "లేవమ్మా తోవకడ్డంగా" అన్నాను. ఆమె దగ్గరగా వచ్చి "బాబూ! పోనీయండి కారును నామీదనుంచి. బతికుండి యీ కష్టాలుపడలేను" అని చక్రాలదగ్గర పడిపోయింది. నేను దిగివచ్చి ఆమెను లేవనెత్తి "ఎందుకమ్మా యింత నిరాశ? చచ్చి యేం సాధిస్తావ్?" అన్నాను. ఆమె ఏడుస్తూ "చచ్చి సాధిస్తాననుకుంటున్నాను. బతికుండి యింతవరకూ యేమీ చేయలేకపోయాను. ఆ దుర్మార్గుని చేతుల్లో చచ్చేకన్నా మీవంటి పుణ్యాత్ముని బండికింద పడి చస్తే యింత పుణ్యమైనా వస్తుంది" అని జవాబిచ్చింది. ఒక నిముషం గడిచాక ఆమె సంగతులు విస్తరించింది. "నా భర్త ఒట్టి త్రాగుబోతు! గణించిందంతా దానికే వినియోగిస్తున్నాడు నెల్లాళ్ళయింది వుద్యోగం వూడిపోయి. చేతిలో పైసా ఆడకపోవటంతో నన్ను పట్టుకు సాధిస్తున్నాడు. అప్పటికీ ఆ యింటా యీ యింటా చాకిరీ చేసి బియ్యమో, పిండో తెస్తుంటాను. దాన్నింత గంజి కాచుకుంటే యిద్దరకూ యేదో విధంగా సరిపోయేది. కాని దాన్ని లాక్కుపోయి సారా కొట్టుకు ఒప్పగించి వేస్తుంటాడు. అడ్డుపడితే చావతంతాడు!...యిప్పటికి వారందినాలైంది శరీరం అమ్ముకొని డబ్బు సంపాదించుకురావల్సిందిగా బోధిస్తున్నాడు! ప్రాణాలు పోయినాసరే ఆపని చేసేదిలేదని టలాయించుకొస్తున్నాను. రోజూ శరీరం హూనంచేసి ఒదలిపెడుతున్నాడు. ఈ సాయంత్రం చిత్తుగా తాగి తనతోకూడ యింకొకణ్ణి తెచ్చి నాదగ్గర ఒదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఆ వచ్చినవాడు వెంటనే నామీద విరుచుకు పడ్డాడు. కాని వాడూ మత్తుగా తాగివుండటంవల్ల మాయమాటల్లో ముంచి, పెరటికి వెళ్ళొస్తానని చెప్పి వెనుతిరగకుండా యిక్కడకు

వచ్చేశాను. నాకు చావుతప్పించి యింకేం ఆధారంవుందో చెప్పండి! లేదా బలాత్కారంగా పడుపువృత్తి—" అని పైగా చెప్పలేక ఏడవ నారంభించింది. ఏమిచెప్పి ఆమెను వూరడించటమో నాకు పాలుపోయిందికాదు. అప్పటికీ 'అమ్మా మీ భర్తే మీను దైవం! వారేది చెబితే అది చేయటం మీ కర్తవ్యం!... చదివే వుంటారుగా చిన్నప్పుడు కుమారీ శతకం 'పతిపాపవు పని చెప్పన్ హితమనుచు నాచరింపుము' అపద్యాన్ని నెమరువేసుకోండి!" అంటూ కారును ముందుకు పరువెత్తించాను. ఇంటికి చేరేసరికి పదయింది. భోజనాదికాలు ముగించి, పరుంటున్న సమయంలో ప్రక్కగదినుంచి వికౌరమైన కేకలు వినవచ్చాయ్. ఇదేమబ్బా అని అనుకొంటూండగా తిరిగి అవేకేకలు హెచ్చుస్థాయిలో వినపడ్డాయ్. తడబడుతూ వెళ్ళి చూసేసరికి బయటి తలుపులు వేసిఉన్నాయ్. పెరటినుంచి యింట్లో దూరాను. ఆ దృశ్యం చూసేసరికి గుండెలాగిపోయినంతపని అయింది. ఆ యింటి యిల్లాలు సగం కాలి కొనవూపిరితో వుంది. గదంతా కమురుకంపుతో నిండుకున్నది. ఆమె మరణయాతన అనుభవిస్తున్నది. నేను వెళ్ళి ఆమె ప్రక్కను కూచొని పలుకరించాను. ఆమె అతి కష్టంతో కన్నులు తెరచి "దాహం" అన్నట్టు సౌజ్ఞ చేసింది. వంటింటినుంచి నీళ్లు తెచ్చి నోటిలో పోశాను. చెంబెడునీళ్లు త్రాగి కొస్త తెప్పరిల్లుకుంది. గట్టిగా నిట్టూర్చి "ఎవరు బాబూ?" అని అంతలోనే పోల్చింది కామోసు యిలాఅన్నది: "నువ్వా నాయనా! ప్రాణాలు పోయేముందు నా క్షోభను చెప్పుకొని మనసు చులకన చేసుకోవల్సిందని కాబోలు ఆ దేవుడు నిన్ను పంపించాడు. నా భర్త వీరరంతా అనుకున్నంత అమాయకుడూ మంచివాడూ కాడు. అతి వ్యభిచారి. శరీరాన్ని ఘోరమైన రోగాల్తో నింపుకున్నాడు. నా శరీరాన్నీ నింపేశాడు. డబ్బుయివ్వక పోవటంవల్ల బయటి మిండగత్తెలు రానీయలేదు. ఇంట్లో పూరిపుడకైనా లేదు అమ్ముకోవటానికి. అన్నీ అంతకుముందే స్వాహా అయిపోయాయి. ఇప్పుడు రెండునెలలై ఒంటబట్టిన రోగాలు ముదిరిపోవటంవల్ల మంచంపట్టి వున్నాను. లేవటానికి కొస్తంతయినా శక్తిలేదు. ఇలాంటిస్థితిలో కూడా ఆ కామాంధుడు నన్ను విడిపెట్టలేదు. రాత్రనక పగలనక తనపశువాంఛ తీర్చుకుంటున్నాడు. అడ్డుపెడుతూంటే చావ మోదుతున్నాడు. యీవుదయం నన్ను చూట్టానికని మా చెల్లెలొచ్చింది. సాయంత్రం దాన్ని పట్టుకొని బలవంతం చేశాడు. నా యెదుటనే ఆమెనునగ్నం చేసేసరికి ప్రతిహింస నాలో వేయి విధాల విజృంభించి పోయింది! దగ్గర నేవున్న చెంబుతో ముఖం బద్దలయేలా బాదినాను. నుదురు పగిలి కాస్సేపు తెలివి తప్పిపోయాడు. ఆదే సమయంలో మా చెల్లెల్ని పారిపోవలసిందని కేక వేశాను. ఆమె అదర బాదరాతో చీర జాకెట్టు ఒంటికి చుట్టుకొని వెనక్కు తిరిగిచూడకుండా పారిపోయింది. ఇక ఆ దుష్టునికి తెలివి వచ్చిందేమో నా వేపు తిరిగాడు. నన్ను మంచానికేసి కట్టివేసి, వివస్త్రనుచేసి చెప్పరాని యాతనల్లో ముంచాడు. చివరకు కసితీరక కిరసనూనెయందు నా చీరను ముంచి, నా శరీరానికిచుట్టి నిప్పంటించి వుంటాడు. అంతకుముందే నాకు తెలివి తప్పిపోయింది. తెలివొచ్చేసరికి శరీరమంతా మంటలు! ఇదిగో యీ స్థితిలో వున్నాను. ఇక నేనెంతోకాలం—"

ఆమె యింకా యేమో చెప్పబోయింది. కాని నాకు శరీరమంతా చమటలు క్రమ్ముకున్నాయ్. గుండెల్లో దడ బయలుదేరింది. చటుకున తెలివొచ్చింది. లేచిచూసేసరికి గడియారం ముల్లు నాలుగున్నర చూపింది. నిజంగా నేశరీరం చమటల్తో నిండిపోవటంవల్ల గాలికని కిటికీలు తెరచాను. ఆదే వుపన్యాసం గంభీర ధ్వనుల్తో వినవస్తూన్నది:

"...హిందూకోడ్ బిల్! సనాతన ధర్మ వృక్షానికి గొడ్డలిపెట్టు! దాంపత్య సూత్రానికి కత్తెరకాటు! గృహసామ్రాజ్యానికి మహారాణులైవున్న మహిళామణుల్ని పదచ్యుతుల్ని చేసే భయంకర విప్లవశక్తి!"

(ఒక హిందీ రచన ఆధారంతో)